# ఎర్రజొన్న రైతులను పట్టించుకోండి

## సిఎంకు బాబు లేఖ

(ప్రజాశక్తి–హైదరాబాద్‌బ్యూరో)

రాష్ట్రంలో ఎర్రజొన్న సాగుచేసిన రైతులకు మద్దతు ధర ఇప్పించి వారి సమస్యలను పరిష్కరించాలని టిడిపి అధినేత చంద్రబాబునాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డికి ఆయన ఒక లేఖ రాశారు. నిజామాబాద్ జిల్లాలో దాదాపు 25 వేలకు పైగా ఉన్న ఎర్రజొన్న రైతాంగం ఈ యేడాది మద్దతు ధర ఇప్పించాలని ప్రభుత్వాన్ని కోరినప్పుడు అంకాపూర్‌కు చెందిన విత్తన సంస్థ మెస్సర్స్ గోదావరి హైబ్రీడ్స్ 5 లక్షలా 11 వేల క్వింటాళ్లను కిలో 15.40 రూపాయల చొప్పున కొనుగోలు చేస్తుందని ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహించి హామీ ఇచ్చిన విషయాన్ని ఆ లేఖలో చంద్రబాబు పేర్కొన్నారు. అయితే సదరు విత్తన సంస్థ రాష్ట్ర ప్రభుత్వం, రైతులకు ఇచ్చిన హామీకి విరుద్ధంగా కేవలం 2,03,000 క్వింటాళ్ళకు రూ.32 కోట్లు మాత్రమే చెల్లించి, మిగతా రూ.46 కోట్లు చెల్లించకుండా చేతులు ఎత్తేసిన నేపథ్యంలో జరిగిన అన్యాయాన్ని సహించలేక ఎర్రజొన్న రైతాంగం ఏకమై బకాయిలు ఇప్పించాలని కోరుతూ అందోళన నిర్వహించిందని అన్నారు. ఈ అందోళన సందర్భంగా జూన్ 16న ఆర్మూర్‌లో రైతులపై పోలీసులు అమానుషంగా కాల్పులు జరిపితే ముగ్గురు రైతులు, విద్యార్థి కాల్పుల్లో గాయపడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులు రక్తం చిందిన తర్వాతనే ప్రభుత్వం స్పందించిందన్నారు. ఎర్రజొన్న రైతుల సమస్యలను పరిష్కరిస్తామని జిల్లా యంత్రాంగం జూన్ 18న లిఖిత పూర్వకంగా హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఎపి సీడ్స్ ద్వారా కిలోకు రూ.12 లకు కొనగోలు చేసి తక్షణం తేడాను భర్తీ చేయడానికి ఎర్రజొన్నల విత్తనాలను విక్రయించడం ద్వారా ఎపి సీడ్స్‌కు వచ్చే లాభాన్ని ఆగస్టు నెలాఖరు కల్లా రైతులకు సర్దుబాబు చేయిస్తామని ప్రభుత్వం తరుపునా చెప్పారని తెలిపారు. దీనికి అనుగుణంగా జిఓ 153 విడుదల చేశారని, రైతులకు చెల్లించవలసిన 10.83 రూపాయల కోట్లును గుడువు సమయం దాటి 45 రోజులు గడిచినా ప్రభుత్వం వైపు నుంచి ఉలుకూపలుకు లేదని తెలిపారు. ఈ ఏడాది ఎర్రజొన్న సీడ్ కిలోను రూ.11లకే కొనుగోలు చేస్తామని ప్రయివేట్ సీడ్ కంపెనీలు ఎర్రజొన్న రైతులపై ఒత్తిడి తెస్తున్నాయని తెలిపారు. క్వింటాల్‌కు ఇంతకు ముందుకు మాదిరిగా 5 కిలోల బదులు 10 కిలోల చొప్పున తరుగు తీయాలని నిర్ణయించడంలో రైతులు ఆందోళన చెందుతున్నారని చెప్పారు. ప్రభుత్వ నిర్లిప్త ధోరణి వల్ల కంపెనీలన్నీ సిండికేట్‌గా ఏర్పడి రూ.100 ధర గల 2 కిలోల సీడ్ ప్యాకెట్‌ను రూ.500లకు అమ్ముతూ రైతులకు నిలువుదోపిడి చేస్తున్నారన్నారు. రైతులకు తక్షణం బకాయిల కోసం మొత్తం రూ.10.83 కోట్లు వడ్డీతో చెల్లించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. బకాయిల కోసం ఉద్యమించిన సమయంలో ఎర్రజొన్న రైతులపై బనాయించిన కేసులను ఎత్తివేయాలని, రైతులను మోసం చేసిన గోదావరి హైబ్రీడ్ సీడ్స్ అధినేతను అరెస్టు చేసి చట్ట ప్రకారం శిక్షించాలన్నారు.

# పెట్టుబడిదారీ వ్యవస్థ బుడగలాంటిది

★ అమెరికా ఆర్థిక సంక్షోభమే నిదర్శనం
★ ఉద్యమాలతో సరళీకరణను అడ్డుకోవాలి
★ ఆర్థిక స్వావలంబనను కాపాడుకోవాలి
★ సిఐటియు జాతీయ కార్యదర్శి దీపాంకర్ ముఖర్జీ

(ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో)


సెమినార్‌లో మాట్లాడుతున్న దీపాంకర్ ముఖర్జీ

పెట్టుబడిదారీ విధానం బుడగలాంటిదని సిఐటియు జాతీయ కార్యదర్శి దీపాంకర్ ముఖర్జీ పేర్కొన్నారు. అమెరికా ఆర్థిక సంక్షోభమే అందుకు నిదర్శనంగా అభివర్ణించారు. మార్కెట్ శక్తులే అన్నీ నిర్ణయిస్తాయన్న ఉదారవాద ఆర్థిక విధానాల వైఫల్యమే ఇదని అన్నారు. పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్యవాదులకు మాత్రమే ఉపకరిస్తుందని అన్నారు. సోషలిజం కూలిపోయిందని దుష్ప్రచారం చేసినవారంతా, పెట్టుబడిదారీ విధానం సంక్షోభంపై సమాధానం చెప్పాలని అన్నారు. మార్కెట్‌పై ప్రయివేటు వ్యక్తుల పెత్తనం పెరిగి ప్రభుత్వ పాత్ర తగ్గిపోతోందని చెప్పారు. 'అమెరికా ఆర్థిక సంక్షోభం – అణు ఒప్పందం – భారతదేశంపై ప్రభావం' అనే అంశంపై హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన సెమినార్‌కు ముఖర్జీ ముఖ్యవక్తగా హాజరయ్యారు. సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.నరసింహారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్‌లో ముఖర్జీ మాట్లాడారు. మన ఆర్థిక వ్యవస్థలోని నియంత్రణా వ్యవస్థలు, ప్రభుత్వ పట్టుకారణంగానే అమెరికా ఆర్థిక సంక్షోభ ప్రభావంతో భారతదేశాన్ని నష్టపోకుండా కాపాడుకోగలిగామని అన్నారు. దేశంలో రెండు కోట్లమంది సంఘటిత, 40 కోట్ల మంది అసంఘటితరంగ కార్మికులు సాగించిన పోరాటాలు... ముఖ్యంగా బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ ఉద్యోగుల ఉద్యమ ఫలితంగానే ఇది సాధ్యమైందని అన్నారు. స్వేచ్ఛా వ్యాపారంతో దేశంలోని బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ తదితర సంస్థలతో పాటు దేశ ఆర్థిక వ్యవస్థ ఏ రకంగా నాశనం అవుతోందో ప్రజలకు కార్మికులు వివరించి చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. ప్రపంచీకరణ విధానాలు నష్టమని తెలిసినా విదేశీ పెట్టుబడులను ప్రధాని మన్మోహన్ సింగ్ ఆహ్వానిస్తున్నారని అన్నారు.

గతంలో తమ వేతనాల కోసం పోరాడే కార్మికులు, ఉద్యోగులు నేడు ఆయా సంస్థలను కాపాడుకోడానికి పోరాటాలు చేయాల్సి వస్తోందని అన్నారు. దేశంలో ఉన్న ఎరువుల కంపెనీలను గత ఎన్డీయే ప్రభుత్వం అమ్మేసిందన్నారు. తత్ఫలితంగా ఏటా 40 నుంచి 50 లక్షల టన్నుల యూరియాను దిగుమతి చేసుకోవలసి వస్తోందని చెప్పారు. దేశంలోని ఆంధ్రప్రదేశ్, కర్నాటక, బెంగాల్ రాష్ట్రాల్లో యురేనియం నిల్వలు ఉన్నా అమెరికాపై ఆధారపడే అణు విద్యుత్ కోసం పాలకులు వెంపర్లాడుతున్నారని విమర్శించారు. ఆర్థికంగా, రాజకీయంగా దివాళా తీసిన అమెరికాను భారత ప్రధాని మన్మోహన్ మాత్రమే పొగుడుతున్నారని చెప్పారు. అణు ఒప్పందం విద్యుత్‌కు మాత్రమే సంబంధించింది కాదని భారత విదేశాంగ విధానం, ఆర్థిక విధానలను ప్రభావితం చేసేదిగా ఉందని విమర్శించారు. ప్రభుత్వరంగ సంస్థల నుండి ప్రస్తుతం ఉపసంహరించుకుంటున్న 49 శాతం పెట్టుబడులను భవిష్యత్‌లో 51 శాతానికి పెంచబోమనే ఒప్పందాలేవీ లేవని ఆర్థిక మంత్రి చిదంబరమే స్వయంగా చెప్పడం గమనార్హమని అన్నారు. వామపక్షాలకు తాను కట్టు బానిసలా మారానని ప్రధాని మన్మోహన్ తెగ బాధపడిపోయారనీ, ఆర్థిక రంగంలోకి విచ్చలవిడిగా ప్రవేశించే విదేశీ పెట్టుబడులను వామపక్షాలు అడ్డుకోకుంటే నేడు భారత ప్రజలే బానిసలుగా మారిపోయేవారని చమత్కరించారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్, చంద్రబాబునాయుడు పరస్పరం అవినీతి ఆరోపణలు చేసుకుంటూ ప్రజా వ్యతిరేక విధానాల నుండి ప్రజల దృష్టిని పక్కదారి పట్టిస్తున్నారని అన్నారు. ఒరిస్సా, కర్నాటకల్లో మైనార్టీలపై దాడులు సాగించిన మతతత్వ శక్తులు ఆంధ్రప్రదేశ్‌లోనూ భైంసాలాంటి చోట్ల పడగవిప్పుతున్నారని అన్నారు. దేశానికి నష్టదాయకమైన సరళీకరణ విధానాల విషయంలో ఒక అభిప్రాయం గల కాంగ్రెస్, బిజెపి వాస్తవ సమస్యలను పక్కనబెట్టి ప్రజల ముందు వేరే అంశాలు పెడుతున్నాయని విమర్శించారు. దేశంలోని కార్మికులు, ఉద్యోగులు ఈ విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించి పోరాటాలతో దేశాన్ని రక్షించాలని పిలుపునిచ్చారు. సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.సుధాభాస్కర్ మాట్లాడుతూ అమెరికాలో తుమ్ములు వస్తే భారత్‌లో ముక్కు ఊడిపోయే పరిస్థితికి కారణం ప్రపంచీకరణేనని అన్నారు. అమెరికా ప్రజలు పన్నుల ద్వారా చెల్లిస్తున్న డబ్బును ఆ దేశ పెట్టుబడిదారులను రక్షించడానికి ఉపయోగిస్తున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో సిఐటియు నగర ప్రధాన కార్యదర్శి జె.వెంకటేశ్, కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థల యూనియన్ నగర కన్వీనర్ జె.రాఘవరావు, బ్యాంకింగ్ ఎంప్లాయిస్ పెడరేషన్ ఆఫ్ ఇండియా నగర ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, వివిధ రంగాల కార్మికులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

# ఇతర నటులపై వ్యక్తిగత విమర్శలొద్దు : వైఎస్

(ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో)

కాంగ్రెస్ పార్టీ తరపున ప్రచారం చేసే నటీనటులు ఇతర పార్టీల్లో ఉన్న నటులను వ్యక్తిగతంగా విమర్శించాల్సిన అవసరం లేదని ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి పేర్కొన్నారు. వివాదాల జోలికి వెళ్లకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రచారం చేయాలని ఆయన సినీ ప్రముఖులకు సూచించారు. సిఎం క్యాంపు కార్యాలయంలో ఆదివారం సాయంత్రం సినీ ప్రముఖులు ధర్మవరపు సుబ్రమణ్యం, రాజశేఖర్, జీవిత, జయసుధ, ఎస్వీ కృష్ణారెడ్డి, అచ్చిరెడ్డి, తదితరులు ముఖ్యమంత్రితో భేటీ అయ్యారు. ఈ సమావేశంలో పిసిసి అధ్యక్షులు డి శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైఎస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో చురుగ్గా పనిచేస్తున్న సినీరంగానికి చెందిన ప్రముఖుల సేవలను ప్రణాళికాబద్ధంగా వినియోగించుకుంటామన్నారు. వారానికి ఒక్కరోజైనా పార్టీకి సమయాన్ని కేటాయించాలని వారిని అభ్యర్థించారు. ఎన్నికల సమయంలో ఎక్కువ సమయం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఏ రోజు పార్టీకి సమయం కేటాయిస్తారో ముందుగా చెబితే ఆయా జిల్లాల్లో డిసిసిలతో పిసిసి అధ్యక్షులు డిఎస్ సమన్వయం చేసుకొని కార్యక్రమాలు నిర్వహించడం సులభమవుతుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనే సినీనటులు వివాదాల జోలికి వెళ్లకుండా పర్యటించాలని సూచించారు. ప్రజల కోసం ప్రభుత్వం పడుతున్న కష్టాలను తమదైన శైలిలో ప్రజల మనస్సుల్లో నాటుకొనేలా ప్రచారం చేయాలని కోరారు. వచ్చే ఎన్నికల్లో వివిధ ప్రచార, ప్రసార మాధ్యమాల్లో ఏవిధంగా కార్యక్రమాలు అమలు చేయాలనే విషయమై సినీ అనుభవంతో పటిష్టమైన ప్రచార వ్యూహాన్ని రూపొందించాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణాకు అధిష్టానం సానుకూలం : డిఎస్

(ప్రజాశక్తి – హైదరాబాద్ బ్యూరో)

తెలంగాణాపై కాంగ్రెస్ అధిష్టానం సానుకూలంగానే నిర్ణయం తీసుకుంటుందని పిసిసి అధ్యక్షులు డి శ్రీనివాస్ వ్యాఖ్యానించారు. ఆదివారం నవ తెలంగాణా ప్రజాపార్టీ నేత పెద్దిరెడ్డి డిఎస్‌ను కలిశారు. ఢిల్లీ వెళ్లే అఖిలపక్ష బృందంతో కలిసి రావాలని డిఎస్‌ను ఆయన అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఎన్‌టిపిపి నేతలను ఉద్దేశించి డిఎస్ మాట్లాడుతూ తాను ఢిల్లీ వెళ్లిన సందర్భంగా రాష్ట్ర రాజకీయ పరిస్థితిని సోనియాకు వివరించానని చెప్పారు. తెలంగాణాకు అనుకూలంగా నిర్ణయం తీసుకోకపోతే పార్టీకి నష్టం జరుగుతుందని సోనియాకు స్పష్టంగా చెప్పినట్లు వివరించారు. తెలంగాణాకు అధిష్టానం అనుకూలంగా నిర్ణయం తీసుకుంటుందని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. అఖిలపక్షం ఢిల్లీ వెళ్లడం హర్షణీయమని, కాంగ్రెస్ అధిష్టానం తప్పక అపాయింట్‌మెంట్ ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పెద్దిరెడ్డి మాట్లాడుతూ తెలంగాణాపై తక్షణమే నిర్ణయం తీసుకునే దిశగా కాంగ్రెస్ పార్టీ అధిష్టానంపై వత్తిడి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. అఖిలపక్షంలో కాంగ్రెస్ వారు కూడా ఢిల్లీ రావాలని కోరితే డిఎస్ స్పందించలేదని తెలిసింది.

# ఓంకార్‌కు అంతిమ వీడ్కోలు

(ప్రజాశక్తి విలేకరి – నర్సంపేట)


ఓంకార్‌కు నివాళ్లర్పిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి.నాగయ్య,

వరంగల్ జిల్లా నర్సంపేట మాజీ ఎంఎల్ఏ మద్దికాయల ఓంకార్‌కు ప్రజలు కన్నీటి వీడ్కోలు పలికారు. ఎర్రజెండాలతో నర్సంపేట ఎరుపెక్కింది. గీసుగొండ, కొమ్మాల, గిర్నిబావి, లక్నెపెల్లి, మహేశ్వరం గ్రామాల వద్ద ప్రజలు తండోపతండాలుగా తరలొచ్చి ఓంకార్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు ఓంకార్ మృతదేహం నర్సంపేటకు చేరుకుంది. నర్సంపేటలో అంబేద్కర్ సెంటర్ మెయిన్‌రోడ్డు మీదుగా వల్లబ్‌నగర్ వరకూ ప్రజలు అంతిమయాత్రలో పాల్గొని వీడ్కోలు పలికారు. ఎంసిపిఐ(యు) కార్యకర్తలు ఎర్రజెండాలు చేతబూని ప్రదర్శనలో పాల్గొన్నారు. అంతిమయాత్ర వరంగల్ రోడ్డు సెంటర్ నుండి ఎంసిపిఐ(యు) కార్యాలయం వరకూ కొనసాగింది. ఓంకార్ మృతదేహం వెంట భార్య లక్ష్మమ్మ, కుమారులు, కుమార్తె ఉన్నారు. ప్రజల సందర్శనార్థం పార్టీ కార్యాలయ ఆవరణలో భౌతికకాయాన్ని కొద్ది సేపు ఉంచారు. అనంతరం వల్లబ్‌నగర్‌లోని మినీస్టేడియం స్థలంలో దహన సంస్కారాలు చేశారు.

**ప్రముఖుల నివాళి**

ఓంకార్ భౌతికకాయాన్ని స్టేషన్‌ఘన్‌పూర్ ఎంఎల్ఏ కడియం శ్రీహరి, వరంగల్ ఎంపి ఎర్రబెల్లి దయాకర్‌రావు, టిడిపి జిల్లా అధ్యక్షులు రేవూరి ప్రకాశ్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, సిపిఎం జిల్లా కార్యదర్శి జి. నాగయ్య, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గాదె ప్రభాకర్‌రెడ్డి, డివిజన్ కార్యదర్శి పెద్దారపు రమేష్, టిఆర్ఎస్ జిల్లా మాజీ అధ్యక్షులు పెద్ది సుదర్శన్‌రెడ్డి, ప్రజారాజ్యం పార్టీ నాయకులు గోపు జయపాల్‌రెడ్డి, ఎంసిపిఐ(యు) రాష్ట్ర కార్యదర్శి యం. వెంకట్‌రెడ్డి, సహాయ కార్యదర్శి సోమరాజన్న, పొలిట్‌బ్యూరో సభ్యులు ఎస్. గంగాధర్‌రెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు గోవిందన్, ఎం.డి. గౌస్, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ కేంద్ర కమిటీ సభ్యుడు గుర్రం విజయ్‌కుమార్, కోటయ్య, సిపిఐ నాయకులు రాంనర్సింహారావు, బిజెపి సీనియర్ నాయకులు జంగారెడ్డి, న్యూడెమోక్రసీ నాయకులు వేములపెల్లి వెంకటయ్య, బి.వి. కృష్ణారెడ్డి, కేంద్ర కమిటీ సభ్యుడు గాదె దివాకర్ ఓంకార్‌కు నివాళ్లు అర్పించారు.

హైదరాబాద్ తెలంగాణలో అంతర్భాగమే

# పార్లమెంట్ వాయిదాకు బిజెపి, కాంగ్రెస్

## నల్గొండ జిల్లా నుండే పోటీ : సురవరం

(ప్రజాశక్తి ప్రతినిధి –నల్గొండ)

హైదరాబాద్ నగరం కొత్తగా ఏర్పడింది కాదనీ, అది తెలంగాణ ప్రాంతంలో అంతర్భాగమేనని సిపిఐ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి అన్నారు. నల్గొండలోని సిపిఐ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుకు అడ్డంకులు కలిగించే ప్రయత్నాల్లో భాగంగా లేని సమస్యను ఉన్నట్లుగా చెబుతూ గందరగోళాన్ని సృష్టిస్తున్నారని విమర్శించారు. జెసి.దివాకర్‌రెడ్డి, దానం నాగేందర్, అసదుద్దీన్ ఓవైసీ ప్రకటనల వెనుక కుట్ర దాగుందన్నారు. 'పలికేదెవరు..? పలికించేదెవరు..?' అంటూ పరోక్షంగా వైఎస్‌ను విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో నల్గొండ జిల్లా నుండే పోటీ చేసే అవకాశముందని, ఈ మేరకు పార్టీ ఒక అభిప్రాయానికొచ్చిందని తెలిపారు. అందులో తమకు బలమున్న అసెంబ్లీ నియోజకవర్గాలు భువనగిరి పార్లమెంట్ స్థానంలోకెళ్లినందునా ఆ స్థానం నుండే పోటీ చేయాలని జిల్లా పార్టీ అభిప్రాయపడినట్లు వెల్లడించారు. ఇప్పటికే రాష్ట్రంలో పొత్తులు, పార్టీల బలాబలాలపై చర్చిస్తున్నామని, నవంబర్ 1, 2తేదీల్లో జరిగే పార్టీ కేంద్ర కమిటీ సమావేశాల్లో ఓ నిర్ణయం తీసుకునే అవకాశముందన్నారు. వరికి వెయ్యి రూపాయల మద్దతు ధరను చెల్లించాలని రాష్ట్ర శాసన సభలో ఏకగ్రీవ తీర్మానం చేసినప్పటికీ కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం విచారకరమన్నారు. బోనస్‌తో రైతుల కంటే మిల్లర్లకే ఎక్కువ లాభం చేకూరుతోందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర మంత్రులు ఎరువుల కొరత, మద్దతు ధర, ఐదువేల రుణాల మాఫీ వంటి సమస్యలపై దృష్టి సారించకుండా అసంబద్ధ వాదనలపై అతితెలివి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు.

# ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థుల మృతి

(ప్రజాశక్తి విలేకరి–ఘట్‌కేసర్)

అనుమానాస్పద స్థితిలో ఇద్దరు ఇంజనీరింగ్ విద్యార్థులు మృతిచెందారు. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా ఘట్‌కేసర్ రైల్వేస్టేషన్ సమీపంలోని ఎరి మల్లెవాగు బ్రిడ్జి వద్ద జరిగింది. సంఘటనా స్థలంలో మద్యం, కూల్‌డ్రింక్ సీసాలు పడివున్నాయి. కరీంనగర్ జిల్లా గోదావరిఖనికి చెందిన ఎన్.అయిలయ్య కుమారుడు కిషోర్‌కుమార్(20), పి.ఎల్లయ్య కుమారుడు సంతోష్ కుమార్(19) అంకుషాపూర్‌లోని ఎసిఇ ఇంజనీరింగ్ కళాశాలలో బిటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఘట్‌కేసర్‌లోని బుగ్గానగర్‌లోని అద్దె ఇంట్లో నివాసముంటున్నారు. ఇద్దరూ శనివారం రాత్రి 12 గంటల సమయంలో ఎరిమల్లెవాగు వద్ద బ్రిడ్జి దాటుతుండగా రైలు ఢీకొంది. దాంతో కిషోర్‌కుమార్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రగాయాలైన సంతోష్‌కుమార్‌ను రైల్వే పోలీసులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యంలో మృతిచెందాడు. విద్యార్థుల తండ్రులు సింగరేణి కాలరీస్ కార్మికులు. సంఘటనా స్థలం నిర్మానుష్యంగా ఉండడంతో వారు అక్కడికెళ్లే అవకాశమే లేదు. అక్కడ మద్యం, కూల్‌డ్రింక్ సీసాలు న్నాయి. మృతులు అక్కడ మద్యం తాగారా, లేక ఇంకెవరైనా ఉన్నారా అన్న అనుమానాలు వ్యక్తమౌతున్నాయి. తమ స్నేహితులకు ఆత్మహత్య చేసుకునే సమస్యలే లేవని తోటి విద్యార్థి స్వామి చెప్పాడు. పూర్తివివరాల కోసం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# బాంబు బెదిరింపుతో కాకినాడలో కలకలం

(ప్రజాశక్తి ప్రతినిధి–కాకినాడ)

తూర్పు గోదావరి జిల్లా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో ఆదివారం ఉదయం స్కూటరు బాంబు ఉదంతం కలకలం సృష్టించింది. రోగులనూ, వారి బంధువులనూ భయభ్రాంతులకు గురి చేసింది. ఆసుపత్రి ప్రాంగణంలో సైకాలజీ, ఆప్తమాలజీల బ్లాకు నిర్మాణం జరుగుతోంది. దీన్ని క్లాస్–1 కాంట్రాక్టరు దుళ్లపూడి గొల్లబ్బాయి నిర్మిస్తున్నారు. ఆయన ఆదివారం ఉదయం 11 గంటలకు అక్కడికి వచ్చారు. తన హోండా యాక్టివా వాహనాన్ని అక్కడ పార్కు చేసి లోపలికి వెళ్లారు. పది నిమిషాలకు గుర్తు తెలీని వ్యక్తి నుంచి స్కూటర్లో బాంబు పెట్టాననీ, కొద్దిసేపట్లో పేలుతుందనీ ఫోను వచ్చింది. బుల్లబ్బాయి సీరియస్‌గా తీసుకోలేదు. కొద్దిసేపటి తర్వాత బయటకొచ్చి చూస్తే, తన వాహనం కింది భాగంలో బాంబు అమర్చి ఉన్నట్టు కనిపించింది. వెంటనే ఆయన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న పోలీస్ అవుట్ పోస్టుకూ, తరువాత డిఎస్‌పికీ సమాచారమందించారు. కొద్దిసేపట్లోనే డిఎస్‌పి సూర్యారావు, సిఐ కృష్ణకాంత్, ఇద్దరు ఎస్ఐలు, బాంబు స్క్వాడ్ హుటాహుటీన అక్కడికి చేరుకొని స్కూటర్ స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా దానిని నిర్వీర్యం చేశారు. తరువాత దానిని పరిశీలించి అది ప్రభావంతమైనది కాదని తేల్చారు. ఇది క్వారీల్లో తయారు చేసే బాంబు మాదిరిగా ఉందని నిర్ధారించారు. తనకు ఎవరూ శత్రువులు లేరనీ, ఫోన్ చేసింది ఎవరో తెలీదనీ కాంట్రాక్టరు చెప్పారు. ఆగంతకుడు పబ్లిక్ టెలిఫోన్ నుంచి మాట్లాడినట్టు పోలీసులు గుర్తించారు. ఇది ఆకతాయిల పనే అయివుంటుందని ఎస్‌పి వై.నాగిరెడ్డి తెలిపారు. దీనికి బాధ్యుడైన వ్యక్తిని త్వరలోనే పట్టుకుంటామని ఆయన చెప్పారు.

16×32
కర్నూల్
విజయవాడ
హైదరాబాద్
తిరుపతి
ఓన్లీ